బొమ్మదేవర నాగకుమారి

# ఆడపిల్ల

'భలే భలే మొగాడివోయ్...'

కడ్తోన్న సన్నజాజి మాలని, పూలనీ వదిలేసి... ముందుగదిలోకి పరుగెత్తుకెళ్ళి... రేడియోవాల్యూమ్ పెంచేసాను...

తర్వాత పెదవుల మాటున నాలుక
పరికిణీ చాటున పాదాలు
నాట్యంతటవే కదలసాగేయ్...

'నీ ఆన... నీ దాననోయ్...'

కళ్ళు అరమోడ్పులవ్వ బోతుండగా ఒక్కసారి వులిక్కిపడి చుట్టూ చూసాను...

నానమ్మ

ప్రక్కగదిలో కళ్ళద్దాల్లోంచి చూస్తూ వత్తులు చేసుకుంటోంది ఇంకానయం... ఇటు చూడ్లేదు.

నిజంగానే చూడ్లేదా...

వూహూ... చూసేవుంటుంది...

అయినా వూర్కుందంటే

బాప్‌రే! ఏదో అవ్వబోతోంది...

అసలు మా నానమ్మ వూర్కోదు... ఈ విషయంలో.

టెన్త్‌క్లాస్ ఎగ్జామ్స్ అయిన కొత్తలో అనుకుంటా 'నువ్వడిగింది ఏనాడైనా లేదన్నానా...' పాట రేడియోలో వస్తోంటే... వాల్యూమ్ పెంచి... ఎదురుపాడానని...

ఎంత యుద్ధం చేసేసిందని.

నేనపుడే గట్టిగా చెంపలు వాయించుకున్నాను.

'ఈడొచ్చిన పిల్లవి... ఆ పరుగులేమిటి! హవ్వ? ఆ పాటలేమిటి? ఇంకోసారి ఎదురుపాడేవంటే మీ నాన్నతో చెప్పి నీ నాలుక తెగ్గోయిస్తానంది'

బుద్ధిగా తలవూపాను.

పాడుబుద్ధి పొట్టపుడంతా బానే ఉంటుంది... ఎపుడో ఏ పాటో... విన్పిస్తే ఇంతే సంగతులు.

మనసులో పాడుకుంటే పోలా... అనుకుంటూనే వుంటా... ప్చ్! ప్చ్!

అరక్షణంలో ఏమౌతుంది పరుగెత్తటమెందుకు? అనుకుంటూనే వుంటా... మళ్ళీ ప్చ్! ప్చ్!

అసలు నిజానికి నాకలా అనుకోబుద్ధికాదు.

రైటర్స్ బోల్డంత కష్టపడి
నా కోసమే పాటలొస్తాయన్పిస్తుంది.
సింగర్స్ గొంతులో
మాధుర్యాన్ని నింపుకుని... నా కోసమే పాడ్తున్నారన్పిస్తుంది.

నే వింటాననే
రేడియోవాళ్ళూ పాటలు విన్పిస్తున్నారన్పిస్తుంది.

మరలాటపుడు ఎలా వూర్కోగలను?

నిజానికి నాకా క్షణంలో ఏదీ గుర్తుకురాదు కూడాను...

మళ్ళీ మామూలే

వెంటనే మా నానమ్మ... 'సుభాషితాలు' తప్పవు...

కానీ ఈ సారి నన్నెందుకో కరుణించింది.

మెల్లమెల్లగా మునివేళ్ళపై నడుస్తూ అక్కణ్ణుంచి కదిలానో లేదో...

"పప్పి తల్లీ! పెరట్లో బట్టలున్నాయ్... వానొస్తున్నట్టుంది...కొంచెంచూడమ్మా..." వెనకే నానమ్మ కంఠం..

అంటే చూసేసానని చెప్పటమా!

అయినా ఇంతమృదువుగా చెప్పటం మా నానమ్మ ఎపుడు నేర్చుకుందబ్బా!

ఆశ్చర్యంతోటే... గబగబ పెరట్లోకెళ్ళి బట్టలన్నీ తీసాను... తడిసిన మట్టివాసన మధురంగా వస్తోంది

ఇంకాసేపు అలాగే నిలబడి తడవాలని
తడుస్తూ 'వానా వానా వల్లప్పా' అని పాడాలని
పిచ్చికోరిక...

అమ్మ వూర్కోదు... చంపేస్తుంది తడిస్తే
లోపలికొచ్చాను...
అమ్మ టీ తయారుచేస్తోంది...

అసలు ఈ టీ తయారుచేయడం ఎవరు కనుక్కున్నారో! అనుకుని ఏం లాభం..,

తప్పదు త్రాగాల్సిందే
ప్రతీసాయంకాలం... ఈ టీ త్రాగాల్సిందే
కనీసం వానకురిసిన సాయంకాలమైనా కాఫీ త్రాగితే

"పప్పీ..." పిలుస్తోంది అమ్మ...

అయిష్టంగానే వంటింట్లోకి వెళ్ళాను...

ఇన్‌స్టెంట్ కాఫీ వాసన
నా ముక్కుపుటాలు నన్నే మోసం చేయవ్.

'వాట్?' మళ్ళీ గుండెల్నిండా గాలి పీల్చుకున్నాను. అదే కమ్మటి వాసన... నమ్మశక్యంగాకుండా

"కాఫీ తీసుకో..." అమ్మ చెప్పింది. నేను వింతగా అమ్మవైపు చూసాను. కాఫీ త్రాగితే ఆరోగ్యం పాడవుతుందని సాయంకాలం పూట 'టీ' వంటికి మంచిదని చెప్పే మా అమ్మేనా?

బ్రతిమాలినా వినుక్కోవటం తప్ప కాఫీ ఇవ్వటం తెలీని మా అమ్మేనా?

ఛ! అమ్మ మంచిది...

కామ్‌గా కాఫీ కప్పు తీసుకుని నా గదిలోకి వచ్చేసాను. కిటికీలోంచి బయట కురుస్తోన్న వర్షాన్ని చూస్తూ కాఫీ సిప్ చేయటం నిజంగా గొప్ప అనుభూతి

దాన్ని ఫీల్ అవ్వాల్సిందే

ఈ సాయంకాలం నాకు మరీ అద్భుతంగా కన్పిస్తోంది.

మే నెలలో వచ్చిన వర్షం
పళ్ళెంలోని మల్లెపూలు
నన్నేలోకాల్లోకో తీసుకెళ్తోన్నాయ్...
బయట నాన్నగారొచ్చిన చప్పుడు

తమ్ముళ్ళ గొడవ
గభాల్న బయటకొచ్చాను...

"రారా! పప్పీ! ఇదుగో రసగుల్లాలు... నీకోసమే స్పెషల్‌గా తీసుకొచ్చాము..."

ప్రతినెలా ఫస్ట్ తారీఖున... ఏదో ఒక స్వీట్ తీసుకొచ్చి రసగుల్లాలు తప్పనిసరిగా మర్చిపోయే నాన్నగారు

మైగాడ్! ఇవాళ వీళ్ళందరికీ ఏమైంది...

"అయిస్‌క్రీం పట్టుకొచ్చాము... బ్యాడ్‌లక్... వానొచ్చేసింది..." నాన్నగారి కంఠంలో విచారం...

"నాన్నగారూ! అక్కకి వాన వచ్చినపుడు ఐస్‌క్రీం తింటం ఎంతిష్టమో... పిచ్చిది కదూ..." చిన్న తమ్ముడు తేజా వివరిస్తున్నాడు.

"అబ్బ! ఇవాళ అయిస్‌క్రీములూ దానికే ఇచ్చేద్దాం తెల్లారేసరికల్లా... జలుబు చేస్తుంది..." పెద్ద తమ్ముడు చైతన్య తీర్మానం...

"అరె! అక్కకి జలుబుచేస్తే... ముక్కుతో ఎలా మాట్లాడ్తుందో... కదూ..." తేజా నవ్వుతున్నాడు.

"పొట్టపుడు కూడా అంతేగా... నాకైతే అంత డిఫరెన్సేమీ తెలీదు " చైతు..

"వూర్కోండిరా మీరు మరీను..." నాన్నగారు కసిరారు.

"టీ త్రాగుదురుగాని రండి..." అమ్మ పిలవటంతో నాన్నగారు లోపలికెళ్ళారు.

తమ్ముళ్ళిద్దరూ ఏదో అంటూనే వున్నారు. మధ్యలో టాపిక్ 'క్రికెట్' మీదికి వెళ్ళిపోయింది.

'ఎంతదృష్టవంతులు? ఏదీ ఎక్కువగా పట్టించుకోరు—

**అప్పటిదాకా అంతెత్తున లేచి అరుస్తున్న వాడల్లా— ఒక్కసారిగా కూల్‌గా అయిపోయి, ముఖం చిన్నది చేసుకుని, "సరే అయితే..." అన్నాడు. నాకు దిగులుగా అన్పించింది. ఇంకేముంది? పదిరోజుల్లో పెళ్ళైపోతుంది—**

గళాల్ని ఏదంటే అదే మాట్లాడేసుకుంటారు...

"పదిహేనుకే ముహూర్తం పెట్టేసుకుందామని వాళ్ళు రాసినప్పట్నుంచి నాకు కాళ్ళూ చేతులూ ఆడటంలేదండీ..." లోపల్నుంచి అమ్మగొంతు...

"అంతక్రితం దాకా గొప్పగా భరతనాట్యమేదో, ఆడినట్టు..." నాన్నగారు నవ్వారు...

"మీకంతా వేళాకోళమే... మొదటి శుభకార్యం ఎలా చేస్తామో... ఏమో... తలుచుకుంటేనే గుండెదడొస్తోంది.."

"సరే అయితే ముందు నీ సంగతి మాడాల్సివచ్చేలా వుంది. అనవసరంగా కంగారుపడకు... ఇంకా పదిరోజులుంది... అన్నీ సిద్ధంగానే వున్నాయి... చిన్నచిన్నపన్లేగా మీ తమ్ముడెలాగూ వూళ్ళోనే వున్నాడుగా " నాన్నగారు చెప్పుకుపోతూనే వున్నారు.

"ఏమండీ మనపిల్లసలే పిచ్చిది .వాళ్ళల్లో ఇమిడి పోగల్గుతుందా..." అమ్మ బేలగా అడుగుతోంది.

నాన్నగారు అంతదాకా సరదాగా, తేలికగా చెప్పుకుపోతున్న నాన్నగారు ఏ జవాబూ ఇవ్వలేదు. ఎందుకో నాకు అరక్షణం భయంలాటిది కల్గింది. ఇంకేదో బాధ

రాత్రి డైనింగ్ టేబుల్ దగ్గర
ఎప్పుడూ వుండే గొడవే
నేనే సీట్లో కూర్చున్నా
తేజాకి ఆసీటే కావాలి...

వాడలా అంటే నాకూ ఎందుకో అదే కావాలన్పిస్తుంది. వాడితో గొడవ పెట్టుకోవాలన్పిస్తుంది. ముఖ్యంగా ఎందుకన్పిస్తుందంటే

అమ్మ వాడికి సపోర్ట్ వెళ్తుంది...

"అక్కా! నువ్వా ఛెయిర్లో కూర్చో!" వాడొస్తూనే హడావుడిగా అన్నాడు...

"వూహూ..."

"లెమ్మంటుంటే "

"నేను లేవనంటున్నాగా.."

"వుండు నీపని చెబ్తా..." గ్లాసులో నీళ్ళు నా ప్లేట్లో పోయబోతుంటే

"అరె! తేజా! నువ్వే ఆ ఛెయిర్లో కూర్చోరాదూ..." అమ్మ అంది...

"వూహూ నేను కూర్చోను..."

"మాడు... ఇంకో పదిరోజుల్లో అక్క వెళ్ళిపోతుంది... అపుడు నువ్వే— నీ ఇష్టం వచ్చిన చోట కూర్చోవచ్చు... మరి అక్కతో దెబ్బలాడకూడదు కదూ..." అమ్మ మెల్లగా చెప్పింది.


అప్పటిదాకా అంతెత్తున లేచి అరుస్తున్న వాడల్లా— ఒక్కసారిగా కూల్‌గా అయిపోయి, ముఖం చిన్నది చేసుకుని, "సరే అయితే..." అన్నాడు. నాకు దిగులుగా అన్పించింది.

'ఇంకేముంది? పదిరోజుల్లో పెళ్ళైపోతుంది— నేవెళ్ళిపోతాను..."

నా దిగులది కాదు నేపుట్టానే పెళ్ళి కోసమే పుట్టాననుకున్నారో ఏమో మావాళ్ళు— నన్నెపుడూ అలాటి ఐడియాతోటే పెంచారు...

ఇంటర్మీడియెట్ ఎగ్జామ్స్ రాసేరాయగానే. పెళ్ళిచూపులు అన్నారు... తర్వాత పెళ్ళి అన్నారు...

'సరే' అనాల్సినంత అవసరం కూడా నాకేమీ లేదు.



కానీ నా ఫ్రెండ్ జ్యోతి వచ్చి ఛడామడా తిట్టిపోసింది. అపుడే పెళ్ళేమిటంది? పోట్లాడైనాసరే చదువుకోమంది. నువు చేసుకోవా అన్నాను...

పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి... లెక్చరర్ అయ్యాక చేసుకుంటానంది...

సరే... ఎపుడైతే ఏముంది? ఎపుడైనా చేసుకునేదేగా
కాస్తంత ముందూవెనకా అంతేగా

అయినా తనలా లెక్చరర్నవ్వటమా? మైగాడ్ ఇంకేంలేదు... ఎదురుగుండా ఒక్కరుతప్ప ఇద్దరున్నా నాకు సరిగ్గా మాటేరాదు. (అందుకే నాకు జ్యోతి ఒక్కతే స్నేహితురాలు) అలాటిది—

అంతమంది ముందు నిలబడి— మా జనాలకి లెక్చరర్‌లా ఆగకుండా, తడబడకుండా గడగడా పాఠం చెప్పాలంటే వచ్చినా నావల్లకాదు. మొదటిరోజే డయాస్‌మీదే పడిపోతాను.

ఆ మాత్రం భాగ్యానికి గొడవెందుకు? అయినా నన్ను కన్నదీ, పెంచిందీ— అమ్మా నాన్నేగా—
నా గురించి, నా మంచి గురించి—
వాళ్ళకంటే నా కెక్కువ తెలుస్తుందా?
జ్యోతి దంతా అదోరకం తెలివితక్కువతనం—
లేకపోతే అమ్మా నాన్నల్ని— కాదనమంటుందా?

"పప్పీ! తినవేరా..." నాన్నగారు అడగటంతో ఈ లోకంలోకి వచ్చాను...

అన్నం తినేసి వచ్చి నా గదిలో పడుకున్నాను. నిద్రరావటం లేదు

ఓ పాత నవల

అంతవరకూ ఏ పాతికసార్లు చదివానో...

తీసి మళ్ళీ చదవసాగేను... నాకు టైం తెలీనే లేదు...

"పప్పీ పడుకున్నట్టులేదు ఇంతదాకా మేల్కొని ఆ నవలలూ అవీ చదువుతుంటే ఆరోగ్యం పాడవుతుంది. వెళ్ళిపడుకోమని చెప్పు...." నాన్నగారు...

"పోన్లెద్దురూ ఇక్కడున్న నాల్గురోజులేగా తనిష్టమొచ్చినట్టు వుండనివ్వండీ..."

అంతే పుస్తకమూ్మసేసాన్నేను...

ఆలోచనల్తో నాకు రాత్రంతా సరిగ్గా నిద్రపట్టనేలేదు. ఏ తెల్లవారు జామునో మాగన్నుగా నిద్రపట్టింది.

"నానమ్మా! అక్క ఇంకా లేవలేదు... ఏడున్నరైపోయింది..." పెద్ద తమ్ముడి మాటలు ఎక్కణ్ణుంచో వినిపిస్తున్నాయి.

"అరి భడవా! దాని గొడవ నీకెందుకు... ఎపుడో ఒకపుడు లేస్తుంది.."

"ఎందుకు లేవాలేం అలా? నే వెళ్ళిలేపుతా.."

"వద్దురా చైతూ.. అక్కకి పెళ్ళైపోతే... అక్కడెలాగూ పొద్దున్నే లేవక తప్పదు... ఈ రెండ్రోజులన్నా..."

అంతే ఒక్కున బెడ్‌షీట్ తీసి ప్రక్కన పడేసి లేచాను... అన్నీ నాకిష్టమైన పన్లే చేయనిస్తున్నారు నాకు నచ్చిన విధంగా తమ్ముళ్ళు నాతో దెబ్బలాట్టం లేదు... నేనేదంటే వాళ్ళూ అదే అంటున్నారు.

ఒక్కసారిగా ఇంట్లో వాతావరణమంతా మారిపోయింది. నేనో గొప్ప వ్యక్తినైపోయినట్టు అంతా వివిపి ట్రీట్‌మెంటు ముందెందుకో గొప్పగా అన్పించినా రెండ్రోజుల్లోనే ఎంతో రోటుగా ఏదో వెలితిగా అన్పిస్తోంది. దిగులుగా కోపంగా వూహూ ఈ బాధేమిటో అర్థం కావట్లేదు. రెండ్రోజులు గడిచిపోయాయి.

సాయంకాలం ఎండా, వాన కల్సి... గమ్మత్తుగా వుంది... నేనూ వున్నాను సుమా అంటూ మధ్యలో మొదలైన గాలి పెరట్లో మామిడికాయ రాలిన తియ్యటి శబ్దం పరుగున వెళ్ళాను...

నాకంటే ముందే తేజా వెళ్ళాడు... అపుడే క్రిందపడిన కాయని తీసుకుని చేత్తో దుమ్ము దులుపుతున్నాడు...

నన్నుచూసి ముందునవ్వాడు ఆ పుల్లటిరుచి... చిన్న మామిడికాయ వాడి చేతిలో చూడగానే నిరుత్సాహం...

వాణ్ణి బ్రతిమాలదామని... నోరు తెరవబోయేను.

"తీసుకో అక్కా!" చేయిముందుకు జాపబోయి ఆగేను.. ఆశ, దోశ అంటూ వెక్కిరిస్తాడా?

వాడే నా చెయ్యిలాగి చేతిలో మామిడికాయ పెట్టేసి నావైపు చూసి నవ్వాడు...

ఆ నవ్వులో వాడు నోటితో అనకపోయినా– 'పోన్లే అక్కా! ఇంకోవారంలో వెళ్ళిపోతున్నావుగా... మవు తీసుకోలేనే భావం

వూహూ వద్దొద్దు...

"వద్దురా... తేజా..." ఒక్కసారిగా వాణ్ణి దగ్గరికి తీసుకుని ఏడ్చేసాను..."

"అక్కా! ఏమైందే..." వాడు కంగారుగా అడుగుతున్నాడు.

'ఏమైందా? ఏమైందంటే ఏం చెప్పను? ఏదో చెప్పాలంటే చెప్పే ఎలాగున్నానని

ఇలా మీరంతా నన్ను దూరం చేస్తారని ఈ ఇంటికి, నాకు ఋణం ఇంతే అని నేననుకోలేదు వద్దురా!

ప్రతిసారీ నువ్వు పరాయిదానివి ఆడ పిల్లవి అని నాకు గుర్తు చేయకండి నన్నూ మీతో సమానంగా చూడండి

మీరు నాతో దెబ్బలాడండి ఇలా ప్రత్యేకంగా ట్రీట్ చేసి

నన్ను వేరు చేయకండి నన్ను తిడితే నా కిష్టంలేని పనులు నన్ను చేయమంటే వచ్చే ఆనందం

ఇలా నా ఇష్టానికి వదిలేస్తే రావటం లేదు... ఎలా చెప్పను వీటికి మాటలన్నీ

"ఏమైందమ్మా పప్పీ?" అమ్మ అడుగుతోంది దగ్గరికి తీసుకుంటూ

నా కన్నీటికి మాటలొచ్చి, నా మనసులో భావం చెప్పగల్గితే బావుణ్ను.

*

